స్నేహలత

శ్రీ సూరిశెట్టి సాంబశివరావ్ బాబ్జీ

యామినీనాథుని భార్య దామినీలతకి యెనిమిదో కానుపే స్నేహలత!

స్నేహలత చాలా క్లిష్టపరిస్థితుల్లో జన్మించింది. అప్పటికే యామినీనాథుడు అయిదుగురు కుమార్తెల పెళ్లిళ్లతో అణాగారి అప్పులలో మునిగిపోయాడు. ఇంకా యిద్దరబ్బాయిలున్నారు. వారి చదువు సంధ్యల ఖర్చులకి మరీ కష్టంగా వుంటూంది. యాభై రూపాయిల నెల జీతంతో పాపం యేం చేస్తాడు? యేంచెయ్యగలడు? - ఇదే అయోమయంగావుంది యామినీనాథుడికి!

ఎనిమిదో కాన్పుకి కొడుకేనా పుట్టకుండా మళ్లా కూతురే పుట్టింది. అయినా భగవదేచ్ఛకి యామినీనాథుడూ అడ్డుచెయ్యగలడా! - పొంగి పొర్లుకొచ్చే దుఃఖాన్ని మనసులోనే దిగమ్రింగుకుని ఆ పిల్లపేరు "స్నేహలత" అని పెట్టాడు. తల్లి తన ముద్దుకోసం "ముఖజరీ" అని పెట్టకుంది.

స్నేహలత - వయసు పెరుగుతూన్నకొద్దీ ఆమె సౌందర్యంగూడా యీడుకి రెండింతలుగా వృద్ధి పొందుతూ వచ్చింది. పన్నెండేళ్ల యీడులో పరిపూర్ణ యవ్వనం ఆ బాలిక ప్రతీ అవయవంలోనూ తొణికిసలాడ్తూంది. ముద్దుల మూటగట్టే ఆమె అంగ సౌష్టవాన్ని తిలకించి ఆమె పెళ్లి గురించి ఆలోచిస్తూ, ఆలోచిస్తూ, తల్లి దండ్రుల హృదయాల్లో ఓ విధమైన కంపనం బయల్దేరింది.

ఓ నాడు తల్లి కూరగాయలు తరుగుతూ తరుగుతూ వేలు కోసుకుంది. స్నేహలత అదిచూచి చట్టున పరుగెత్తుకుంటూవచ్చి నీటిలో బాగాతడిపిన గుడ్డ పేలికను ఆవిడవేలికి గట్టిగాకట్టి తల్లిమెడకి తన రెండు చేతుల్నీ మెలివేసి, - "అమ్మా నువ్వు రాత్రీ పగలూ యేమిటే యిలా ఆలోచిస్తున్నావ్?" అంటూ అడిగింది చిన్న నవ్వు నవ్వుతూ.

"పో-నువ్వాడుకో" అంది తల్లి విసుగ్గా.
కాని స్నేహలత ఒప్పుకోలేదు.

"ఊఁహూ, చెప్పవే అమ్మా, చెప్పు" అంది మళ్లీ.

తల్లికి మరింత విసుగెత్తి కోపంగా ఆమె చెంప మీద కొట్టబోయింది. కాని ఆ దెబ్బ చెంపపైన తగలకుండా ఆమె కంఠానికి తగిలింది. పాపం ఆవిడ మళ్లీ వెంటనే జాలిపడి స్నేహలతని తన హృదయానికి హత్తుకుని, - "నీకింకా యెక్కడా చోటులేనట్లు యీ కష్టాలన్నీ అనుభవించేందుకు నా కడుపులో యెందుకు పడ్డావు తల్లీ" అంది.

స్నేహలత పరధ్యానంగా కూచుంది. చట్టున లేచి గెంతుతూ, - "అటు చూడవే అమ్మా. ఆ చిలక యేమంటూందో?" అంది.

పంజరంలో రామచిలక అదే సమయానికి "నా వరహాల తల్లీ, రా నాదగ్గిరకి, నాబంగారు బుచ్చీ, రా...రా" అంటూ పలుకుతోంది.

తల్లి కళ్లల్లో నీళ్లూరినై, - "వెళ్లు, చిలక్కి యేదేనా పెట్టు. నేను వంట చేసుకోవాలి" అంది.

స్నేహలత చిలకదగ్గిర కెళ్ళకుండా నింపాదిగా తన నాన్నగారి గదిలో కెళ్లింది. అప్పుడే ఆయన యాభైరూపాయల జీతం అందుకుని లెక్కపెట్టుకుంటున్నాడు. ఫస్టువొచ్చేసింది. కొత్తనెల-అప్పులవాళ్లు పీక్కుతినటానికింక ప్రతీగడియా అవతరిస్తూంటారు. ఇంటి యజమాని అద్దెకోసరం వొస్తాడు. పాలవాడు జీతంకోసం వొస్తాడు - కిరణాశెట్టిగారూ, హల్వాసాయిబూ - కంసాలి మల్లయ్యా - అందరికీ యేదో కాస్తోకాస్త ముట్టజెప్పాలి. యామినీనాథుడికి వాటిని యేంచెయ్యాలో పాలుపోవటం లేదు.

అదే టయిముకి సరిగ్గా స్నేహలతవొచ్చి "నాన్నా" అంటూ పిలిచింది.

కాని ఆ పిలుపు ఆలోచనలో మునిగిపోయిన యామినీనాథుడికి వినిపించలేదు. ఆమె "నాన్నా" అని

యింకా గట్టిగా పిలిచింది. ఇప్పుడాయనకి వినిపించి "యేంఅమ్మాయ్ ?" అన్నాడు.

అమ్మ యెందుకింతగా ఆలోచిస్తుందో నాన్నగారినడిగి తెలుసుకోవాలనుకుంది స్నేహలత ; కాని ఆయన మొహం చూసేటప్పటికి తన నోటంట మాటరాలేదు.

"కాణీ కోసమా, అమ్మాయ్ ? - యిదుగో ఈ కాణీ తీసుకో" అన్నాడాయన యెంతో ముద్దుగా.

స్నేహలత ఆ కాణీని కొంగులో పదిలంగా ముడి వేసుకుని తిరిగొచ్చి వీధివేపునున్న ఓ కిటికీ పక్కని కూచుని అమ్మా నాన్నా యెందుకింత విచారంగా వున్నారా అని ఆలోచిస్తోంది.

పాలవాడికి చాలా రూపాయిలు కావాలి, ఇంక పాలు యివ్వటం మానేస్తానంటూ బెదిరించి మరీ వెళ్లిపోయాడు. పప్పూ, బియ్యం దినుసులూ యిహ అరువుకి యివ్వటం ముమ్మాటికీ జరగదని షావుకారు ఊరిమి వెళ్లిపోయాడు. మూడురోజులలోపుగా డబ్బివ్వకపోతే కోర్టులో దావా పడేస్తానంటూ కంసాలి మల్లయ్య గర్జించి మరీ వెళ్లిపోయాడు. యింటికొచ్చే వాళ్లంతా డబ్బేగాని యింకొకటేదీ అడగటంలేదు. ఎవరేనావొచ్చి బయట్నుంచి పిలిచేసరికి యామినీనాథుడి మొహం మాడిపోతూంటుంది.

స్నేహలతకిదంతా అర్థమైపోయింది. ఆమె ప్రతిరోజూ నాన్నగారి దగ్గిరే తిరుగుతూ వుంటూంది. యేతలుపుచాటునో, యేకిటికీ క్రిందనో, ఆ దగ్గర దగ్గిరే యెక్కడో తన నాన్నగారి మొహం సరిగ్గా కనిపించేచోటు కూచుని ఆయనవేపు తన పెద్దపెద్ద కళ్లతో గుప్‌చుప్‌గా చూస్తూ వుంటూంది.

ఇవాళ నాన్నగారి మొహం చాలా నీరసంగా వుంది. ఆయన గుండెలపైని యెముకల్ని లెక్కపెట్టగలిగేంత స్పష్టంగా అగుపిస్తున్నాయ్. రోజురోజుకీ విచారంతో ఆయన సన్నమై చిక్కిపోతున్నాడు. యిదంతా ఆలోచించుకుని తన రెండు చేతుల్తోనూ మొహం కప్పుకుని యేడవసాగింది స్నేహలత !

ఆ వేళ సాయంకాలం యామినీనాథుడప్పుడే ఆఫీసునుంచి యింటికొచ్చాడు. అంతట్లోకి యిద్దరు బీహారీ సిపాయిలు లాఠీలు పట్టుకుని ద్వారం దగ్గిరకొచ్చి నించున్నారు, వారిలో ఒకతను గట్టిగా "యామినీబాబూ, యామినీబాబూ" అంటూ అరవటం మొదలెట్టాడు.

స్నేహలత పాపం ద్వారబంధం ప్రక్కనించి యమకింకరులాంటి ఆ యిద్దరు సిపాయిల్నీ చూచి గజగజా వొణికిపోయింది.

'వీరిద్దరూ నాన్నని కొట్టడానికిగాని రాలేదు గదా' అంటూ ఆలోచించి తటపటాయిస్తూ నింపాదిగా వారిదగ్గిరికెళ్లి, - "మీరు మా నాన్నని కొట్టకండీ, ఆయనకి విచారం కలిగించకండీ, మీ కాళ్లు పట్టుకుంటా, మీకు కుప్పలు కుప్పలుగా మా పెరట్లో పువ్వు లిస్తాను" అంటూ విన్నవించుకుంది అమాయకంగా.

ఆమె మాటలు వారికేమీ అర్థంకాలేదు.

"మీరు మా నాన్నని కొట్టడాని కొచ్చారుగదూ, అలా కొట్టకండీ ... ఆగండి, యిప్పుడే వొస్తాను."

ఆమె సాయంకాలం దండ గుచ్చుకోటానికని పువ్వులన్నీ కోసి కుప్పలు పెట్టింది. అవన్నీ తన కొంగులో పోసుకొని తీసుకొచ్చి ఆ సిపాయి లిద్దరికీ యిచ్చి "యింక మీరు పొండీ" అంది యెంతో ప్రాధేయపడి.

వారిద్దరికీ యిదేమీ పాలుపోక ఒకరి మొహం మరొకరు చూచుకుంటూ యింకొకమాటు రావొచ్చు గదా అని మెల్లిగా వెళ్లిపోయారు.

స్నేహలత ప్రాణం తెప్పరిల్లింది. విశ్రాంతిగా ఊపిరి పీల్చుకుంది.

సాయంకాలం స్నేహలత డాబామీదికొచ్చి ఆలోచించటం మొదలెట్టింది.

'ఆహాహా! యీ పారిజాత పుష్పాలన్నీ రూపాయలైపోతే పొద్దున్నే లేచి అన్నీ తెంపి అమ్మకిచ్చేదాన్ని - అప్పుడు మా అమ్మాయి బంగారు పిచుకంటుంది అమ్మ. మాలత సాక్షాత్ లక్ష్మీదేవి అంటాడు నాన్న. పాలవాడి అప్పంతా తీరిపోయేది. కంసాలి మల్లయ్య డబ్బు గురించి నాన్నని బెదిరించకపోయేవాడు. అమ్మ రాణీకిమల్లే నగలెన్నెన్నో అలంకరించుకుని కూచునేది. దాసదాసీ లెందరో చాకిరీచేసేవాళ్లు. నాన్న గుర్రం బండిమీద గాలి షికారుకని వెళ్లేవాడు.'

యిల్లా ఆలోచనల్లో మునుగుతూ తేలిపోతూ స్నేహలత నిద్రపోయింది.

మరి కాసేపటికి టపీమని ఆమె నిద్ర పాడైంది. తెలివొచ్చేక ఆమె చుట్టూ బాగా పరకాయించి చూచింది. ఆ వీధిలోనే వుంటూన్న మోక్షదా పిన్ని మాత్రం అమ్మతో యేవేవో గుసగుసలాడ్తూంది.

చెల్లాయ్, అయితే నువ్వింకా వినలేదన్న మాట. కాళికాదేవి మన జమీందారు గారి భార్య కలలో కనిపించి, - "నేను మీకొత్త చెరువులో వుంటున్నాను. వేగంగా యెనిమిదో కానుపుబిడ్డనెవర్నైనా తెచ్చి నాకు బలివ్వండి. అప్పుడే మీ జమీందారీ స్థితిగతులు బాగుపడ్తాయ్. మీరు చిన్న మనుమణ్ణిగూడా పొందుతారు. మీకన్నివిధాలా సౌఖ్యం లభిస్తుంది. లేదంటే మీరంతా అధోగతి పాలయిపోతారు" అంటూ చెప్పిందట. జమీందారుగారి భార్య ఆఘమేఘంగా యెవరేనా యెనిమిదో కానుపు పిల్లనిస్తే ఓ లక్షరూపాయిలు యివ్వటానికికూడా తయారుగావుంది అంటూ యింకా యేమేమో చెప్తూంది పిన్ని.

స్నేహలత యెంతో శ్రద్ధగా యిదంతా వింటూంది.

"ఊరుకో చెల్లీ, యిలాంటివేవీ చెప్పకు, విన్నా పాపమే, కన్నా పాపమే" అంది అమ్మ.

"అబ్బే, అదిగాదమ్మాయ్, మీపిల్లనిచ్చేయమని నేనుగాని చెప్పటానికొచ్చానా యేంటి? అలా యెవరేనా యివ్వగలరనేనా?"

ఆ పొరుగావిడ వెళ్లిపోయేక తల్లి స్నేహలత వేపు చూస్తూ చూస్తూ చాలాసేపు కన్నీరు కారుస్తూ వుంది. తర్వాత ఆమెని లేవదీసి తన కన్నీళ్లని తుడుచుకుని తీసికెళ్లిపోయింది.

ఒక వారం గడిచిపోయింది.

స్నేహలత ఓనాడు తన నాన్నగారి దగ్గిరికొచ్చి "నాన్నా, ఒక లక్షంటే యెన్నుంటాయ్?" అని అడిగింది.

"చాలా రూపాయిలే వుంటాయ్" అన్నాడాయన.

"అయితే మరి వాటితో పాలవాడి అప్పు తీరిపోతుందా?"

"తీరిపోతుంది."

"కంసాలి డబ్బు యిచ్చేయగలమా?"

"ఓ. యిచ్చేయవొచ్చు."

"అప్పులన్నీ తీరిపోతాయా?"

"యేం, యెందుకు? - నాకు నువ్వు లక్షరూపాయిలు ఇస్తావేంటి." అన్నాడాయన నవ్వుతూ.

స్నేహలత మరేమీ చెప్పకుండా నింపాదిగా అక్కణ్ణించి వెళ్లిపోయింది.

దీపావళినాటిరాత్రి ప్రతీ యింట్లోనూ వరసలు వరసలుగా రకరకాల దీపాలు వెలిగిస్తున్నారు.

"అమ్మా, నేను చెరువొడ్డుని దీపాలు వెలిగించి వస్తానే" అంది స్నేహలత.

"వేగంగా వెళ్లి తిరిగిరా. కాని చూడు ఆ కొత్త చెరువు దగ్గిరికి మాత్రం వెళ్లొద్దు సుమీ-సరే" అంది తల్లి.

ఓ కొత్త రంగు రంగుల చీర కట్టుకుని ఓ పళ్లెంలో మట్టి ప్రమిదల్లో దీపాలు పెట్టి చెరువొడ్డుకి పయనమయింది. ఆమె కొత్త చెరువువేపుకే వెళ్లిపోయింది. చెరువులో అప్పటికింకా మెట్లు కట్టించలేదు. మట్టి చెరువు నాలుగువేపులా కుప్పలు కుప్పలుగాపడి కొండలాగా యెత్తుగా తయారయింది. స్నేహలత చెరువుచుట్టూ దీపాలతో అలంకరించింది. తర్వాత ఆ వొడ్డున ఓ చోట నుంచుని ఆమె క్రిందికి చూచింది. చెరువులో నీరు నిండావుంది. నల్లటి నీరు ఆ రాత్రివేళ యింకా నల్లగా కనిపిస్తోంది. చాలా సేపటిదాకా ఆమె రెప్పవెయ్యకుండా ఆ నీటివేపు చూస్తూ వుండిపోయింది. తర్వాత నింపాదిగా నీటిదగ్గిరికొచ్చి నుంచుంది. తన చేతులు రెండూ జోడించి దండంపెట్టి, - "కాళీమాతా" అని టపీమని ఆమె ఆ నీట్లోకి గెంతిపడిపోయింది. ఆ శబ్దంతో వన విహంగాలన్నీ తమ రెక్కల్ని జాలిగా అటుయిటూ ఆడించినై. బెదిరి బేజారెత్తిపోయే మృగాల పాదాల క్రింద నలిగిపోయే యెండుటాకులు చరచరమన్నాయ్. మళ్ళా కాసేపటికి అంతా నిశ్శబ్దమైపోయింది.

క్రమక్రమంగా ఒక్కొక్క దీపమే నిద్రపోయింది. నాలుగు మూలలా యెటుచూచినా చీకటే! సిరాపూసినట్టు నల్లటి గాఢాంధకారమే!

[బెంగాలీకథ ననుసరించి]

ఖర్చు తక్కువ ఫలమధికము!



మీరిక ధనము అధికముగా వెచ్చించి మోటారుకార్లకు, లారీలకు, బస్సులకు క్రొత్త టైర్లు కొననవసరములేదు!

మీపాతటైర్లనే క్రొత్తవిగా సరసమయిన చార్జీలకు తయారుచేసి యివ్వగలము. మానాణ్యమైన పనితనము మీకు తప్పక తృప్తికలిగించగలదు.

అన్ని సైజులలో తయారయిన టైర్లు కూడ అమ్మకమునకు సిద్ధముగానున్నవి.

వివరములకు: జయకేసరి కంపెని,
15 వెస్టుకాట్ రోడ్డు,
రాయపేట, మద్రాసు 14.